

మూసీ నిర్వాసితుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఇప్పటికే ఉన్న నిర్మాణాల జోలికి పోవద్దు

● మూసీ ప్రక్షాళన ఉద్దేశం మంచిదే కానీ నిర్వాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి: సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో ఇప్పటికే ఉన్న నిర్మానాల జోలికి పోవద్దని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చైతన్యపురి డివిజన్ ఫణిగిరికాలనీ వెంకటసాయినగర్‌లో ఆదివారం రాత్రి మూసీ నిర్వాసితులతో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమావేశం నిర్వహించారు. నిర్వాసితుల స్థలం, ఇంటి పత్రాలను పరిశీలించారు. స్థానిక నిర్వాసితులు తమ పరిస్థితులను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వరద నివారణకు హైడ్రా ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూముల రక్షణ కోసం అంటున్నారన్నారు. మూసీ ప్రక్షాళన ఉద్దేశం మంచిదే కానీ మూసీ నిర్వాసితులకు అది శాపంగా మారిందన్నారు. ప్రభుత్వం నిర్వాసితులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా నియంతృత్వంగా వ్యవహరించవద్దన్నారు. మూసీ పరిసరాల్లో చాలా మంది కోట్లు, లక్షల రూపాయలతో స్థలాలు, ఇళ్లను కొనుక్కొని నిర్మాణాలు చేసుకున్నారని వారికి న్యాయం చేయాలన్నారు. హైదరాబాద్‌లో లక్షల ఇళ్లను కమ్యూనిస్ట్ పార్టీ కట్టించిందన్నారు. న్యాయమైన ప్రజల డిమాండ్లకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు.

రూ.4 కోట్ల వ్యవసాయ అప్పు ఇప్పిస్తానని..

వృద్ధ రైతుకు రూ.6 లక్షల బురిడీ

సైదాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిపై నాలుగు కోట్ల రూపాయలు ఇప్పిస్తానని నమ్మించి ఓ వృద్ధ రైతు నుంచి రూ.6 లక్షలు కాజేసి తప్పించుకుని తిరుగుతున్న కేటుగాడిపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలోని ఫరూఖ్‌నగర్ ఎలికట్ట గ్రామానికి చెందిన గున్న భీమయ్య(72) ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో రుణం అవసరం ఉంది. ఈ క్రమంలో తనకు గ్రామంలో ఉన్న 8 ఎకరాల వ్యవసాయ భూమిపై అప్పు కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పరిచయమైన సైదాబాద్ రెడ్డి బస్తీకి చెందిన సంగీత అనే మహిళను సంప్రదించాడు. ఆమె వేము నాయుడి అనే వ్యక్తిని పరిచయం చేసింది. భీమయ్యకు ఉన్న 8 ఎకరాల భూమిపై బంజారాహిల్స్‌లోని వీఎస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా రూ.4 కోట్ల రుణం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఇందుకు ముందుగా అప్రూవల్ కోసం రూ.16లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేయాలని చెప్పాడు. రతన లక్ష్మీనారాయణరెడ్డి పేరుతో ఉన్న బ్యాంకు ఆఫ్ బరోడా ఖాతాలో వేయాలని వేమునాయుడు వివరాలను అందించాడు. దీంతో ఆగస్టు 13న రూ.6లక్షలు ఖాతాలో జమచేశాడు. మరుసటి రోజు వేమునారాయణ రెడ్డికి ఫోన్ చేయగా స్విచాఫ్ వచ్చింది. అతడిని కలిసేందుకు పలు విధాలుగా యత్నించినా అందుబాటులోకి రాలేదు. దీంతో వృద్ధరైతు ఆదివారం సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమించి.. సహజీవనం చేసి.. పెళ్లికి నిరాకరణ

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు

సైదాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి, సహజీవనంచేసి, తర్వాత ముఖం చాటేసిన వ్యక్తిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువతి నగరానికి వచ్చి మోడలింగ్ చేస్తూ సైదాబాద్ కరన్‌బాగ్‌లో నివాసముంటున్నది. ఈ క్రమంలో యాఖత్‌పురాకు చెందిన సయ్యద్ నిహాల్‌ఖాద్రీతో స్నేహం.. ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ఖాద్రీ మహిళతో నాలుగేళ్లుగా సహజీవనం చేశాడు. కొద్ది రోజుల క్రితం పెళ్లి చేసుకోమని యువతి ఒత్తిడి తేగా 'నువ్వు వేరే వర్గానికి చెందిన దానివి. కాబట్టి పెళ్లి చేసుకోవడం సాధ్యం కాదు' అని చెప్పాడు. దాంతో బాధితురాలు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో...

ఆసిఫ్‌నగర్‌కు చెందిన ఓ యువతి కానిస్టేబుల్ పరీక్షల కోసం 2022 దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ సెంటర్‌లో కోచింగ్ తీసుకుంటోంది. ఈ సమయంలో ఆమెకు మహేందర్ అనే యువకుడు పరిచయమయ్యాడు. ప్రేమగా మారి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి దగ్గరయ్యాడు. గతంలో మహేందర్ కుటుంబ సభ్యులు సైతం ఇద్దరికి వివాహం జరిపిస్తామని ఒప్పుకున్నారు. కానీ యువతి కొద్ది రోజులుగా పెళ్లి ప్రస్తావన తెస్తే మహేందర్ దాటవేస్తూ తప్పించుకుని తిరుగుతున్నాడు. దాంతో యువతి మహేందర్‌పై సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదుచేసింది. పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.



శిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న చింతల సురేందర్ యాదవ్

ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ క్యాంప్‌లు దోహదం

మన్సూరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కాలనీలలో ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ సౌత్‌ఎండ్ పార్క్ కాలనీ సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి టి.రవికుమార్ ఆధ్వర్యంలో లేనస్ డయాగ్నొస్టిక్స్ సహకారంతో ఆదివారం కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ మూర్తి, సంయుక్త కార్యదర్శి రాజేష్‌రావు, హెల్త్‌క్యాంప్ డైరెక్టర్ డాక్టర్ అబ్దుల్‌గఫార్, స్నేహ, వెంకట్, రేణుక తదితరులు ఉన్నారు.

నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన

మన్సూరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానాలు చేయడంతో మరొకరికి ప్రాణం పోసిన వారమవుతామని జైభారత్ జాతీయ ప్రధానకార్యదర్శి ఖదిజ్గాని విజయవిహారం రమణ మూర్తి పేర్కొన్నారు. జాయింట్ యాక్షన్ కమిటీ ఫర్ ఐ, ఆర్గాన్, బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర, అవయవ, శరీర దానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బీజేఆర్ విగ్రహాల వద్ద ప్లకార్డులను ప్రదర్శించారు. అనంతరం ఎల్‌బీనగర్ సూర్యోదయకాలనీలోని ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్ భవన్‌లోని జైభారత్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అవయవ దానాలపై వివరించారు. అనంతరం అవయవ దానాలు చేసిన వారి కుటుంబ సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐ, ఆర్గాన్, బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ జేఏసీ కన్వీనర్ గంజి ఈశ్వర్ లింగం, కోకన్వీనర్ చల్లా రామ్, వరంగల్, ఖమ్మం జిల్లాల బాధ్యులు మల్లారెడ్డి, హనుమంతరావు, వాసన్ నేత్ర సేకరణ సంస్థ సభ్యుడు అరవింద్ కుమార్, జైభారత్ జాతీయ కార్యదర్శులు రజని, లోక్‌నాథ్, రాష్ట్ర అధ్యక్షుడు గోల సత్యనారాయణ, నాయకులు మల్లికా వల్లభ, సుధాకర్ బోయ, రాజు, గణేష్ గల్లా తదితరులు ఉన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం రెడ్ ట్యాంక్ సమీపంలోని ప్రసిద్ధ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామివారికి మంగళవాయిద్యాలు, సుప్రభాత సేవ, సువర్ణ పుష్పార్చన, బాలభోగ నివేదన, తీర్థప్రసాద వితరణ, ఉత్సవ మూర్తులకు అభిషేకం, సూర్యహోమం, తిరువీధి ఉత్సవం, శ్రీవారికి అష్టదళపాద పద్మార్చన, శ్రీవారి కల్యాణ మహోత్సవం, మహానివేదన, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కె.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, కేఎల్.గణపతి, ఆర్.జగదీశ్వర్, బీవీ.పాపారావు, కె.సత్తయ్య, కె.శ్రీధర్, పి.శ్యామల, జె.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పండుగకు ఊరెళుతున్నారా..

తస్మాత్ జాగ్రత్త..!

● పోలీసు సూచనలను పాటించండి
● దొంగతనాల నివారణకు సహకరించండి

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో దసరా పండుగకు పది రోజుల ముందు నుంచే అంతటా సందడి వాతావరణం నెలకొంటుంది. దసరా పండుగకు విద్యాసంస్థలకు ఎక్కువ రోజులు సెలవులు ఇవ్వడంతో.. నగరంలో ఉంటున్న గ్రామీణ ప్రాంతవాసులు తమ ఇళ్లకు తాళాలేసి సొంతూరు వెళతుంటారు. ఇదే అదును చేసుకుని దొంగలు తమ చేతివాటానికి పనిచెప్పేందుకు సిద్ధంగా ఉంటారు. దసరా పండుగకు ఊరెళ్లే వారు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలంటున్నారు రాచకొండ పోలీసులు. దొంగతనాల నివారణ కోసం పోలీసుల సూచనలు, సలహాలను పాటించాలని సరూర్‌నగర్ పోలీసులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇంటికి తాళాలు వేసి ఊరెళ్లే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ సరూర్‌నగర్ పోలీసులు పోస్టర్లు, బ్యానర్లు రూపొందించారు. రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశానుసారం.. ప్రతి కాలనీలో పోస్టర్లు అంటించడంతోపాటు ఆటోలకు బ్యానర్లు కట్టి, మైకుల ద్వారా వీధివీధి తిరుగుతూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నట్లు సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వెల్లడించారు. బ్యానర్లతో పాటు సోషల్ మీడియా ద్వారా కూడా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రతి కాలనీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని, పోలీసు సూచనలను పాటించి, దొంగతనాల నివారణకు పోలీసులకు సహకరించాలని విన్నవిస్తున్నారు. కాలనీల్లో సంచరించే అనుమానిత వ్యక్తుల గురించి డయల్ 100కు గానీ, రాచకొండ పోలీస్ కంట్రోల్‌రూం (సెల్‌నెం.8712662666, వాట్సప్ నెం. 8712662111)లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేస్తున్న సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి

సూచనలు ఇవే..!

- ఊరెళ్లే సమయంలో వీలైనంత వరకు విలువైన వస్తువులు, నగలు, నగదు ఇంట్లో పెట్టకుండా.. బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవడం శ్రేయస్కరం.
- సెంట్రల్ లాక్ చేసిన ఇంటికి బయటి నుంచి గొళ్లెం పెట్టవద్దు.
- బయట గేటుకు లోపలి నుంచి తాళం వేసి, ఇంటి గడప ముందు చెప్పులు ఉంచాలి.
- ఇంటి ముందు గదిలో లైట్ వేసి ఉంచాలి.
- పేపర్ బాయ్, పాలు వేసే వ్యక్తులకు రావద్దని చెప్పాలి.
- ఊరెళ్లే సమయంలో ఇంటి పక్కన నమ్మకమైన వారికి, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఇంటి నుంచి బయటకు వెళ్లే మహిళలు, ఇంటి ముందు ముగ్గులు వేసే మహిళలు బంగారు ఆభరణాలను ధరించకపోవడం శ్రేయస్కరం. ఒక వేళ ధరించినా కనబడకుండా, తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
- తాళం వేసిన తరువాత డోర్ కర్టన్ వేసి తాళం కనబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఇంటికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే, మొబైల్ యాప్ ద్వారా సీసీకెమెరాల దృశ్యాలను ఎప్పటికప్పుడు వీక్షించే అవకాశం ఉంటుంది. దీని మూలంగా ఇంటి వద్ద కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలించవచ్చు.



అమ్మవారి ప్రసాదాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కావేటి మహేశ్ తదితరులు



విజయదుర్గామాత పల్లకీ సేవలో అర్చకులు



శ్రీప్రత్యంగిరా అమ్మవారి అభిషేకంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా



సరూర్‌నగర్‌లో సిద్ధార్థ యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, గీతా సెల్ కన్వీనర్ కిరణ్‌కుమార్‌గౌడ్, అరుట్ల సురేష్ తదితరులు

భక్తిపారవశ్యంతో శరన్నవరాత్రి ఉత్సవాలు

● అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్త జనం

సైదాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సైదాబాద్ మాతామైదాన్‌లోని విజయదుర్గామాత, జీవనజ్యోతి సంఘంలోని జయదుర్గాదేవి ఆలయాల్లో భక్తిపారవశ్యంతో జరుగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే భక్తుల రాకతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. అమ్మవారిని సైదాబాద్ పురవీధుల్లో ఊరేగించారు. ఈ ప్రత్యేక పూజాకార్యక్రమాల్లో విజయదుర్గామాత ఆలయంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కావేటి మహేశ్, సభ్యులు అల్లిశ్రవణ్ కుమార్, బీసర్ల రవిశంకర్, యాదగిరిగౌడ్, జయదుర్గాదేవి ఆలయంలో చైర్మన్ కోరుడు అమరేశ్వర్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో భాగంగా ఆర్‌ఎస్‌ఎస్ రూట్ మార్చ్

హయత్‌నగర్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రూట్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు యూనిఫాం ధరించి హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారి, పాతరోడ్డు, కుంట్లూర్‌రోడ్డు పుకట్‌నగర్, భాగ్యనగర్ కాలనీ, వీరభద్రనగర్, హయత్‌నగర్ వీధుల గుండా మార్చ్ నిర్వహించారు. అనంతరం పాతరోడ్డులోని ఎస్‌వీఎస్ హాల్‌లో పథ సంచలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సహ ప్రచారక్ ప్రభు, వడ్డెపల్లి రాంచంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నవ జీవన్ రెడ్డి, కళ్లెం బాల్‌రెడ్డి, పులుసాని జీవన్‌రెడ్డి, కృష్ణ, రవీందర్‌రెడ్డి, ఎల్లప్ప, గోవిందచారి, సామ అల్వాల్ రెడ్డి, గంట ప్రభాకర్‌రెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

ప్రత్యంగిరా అమ్మవారికి విశిష్ట అభిషేకం

మన్సూరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ అనితానగర్‌లోని ఎంఈ.రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ప్రత్యంగిరా భక్త విభాగ్ ది పార్ట్ ఆఫ్ రక్షితి రక్షితః ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యంగిరా అమ్మవారి విశిష్ట అభిషేకాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. శివస్వామి సంకల్పంతో 108 దక్షిణామృత శంకాలతో 108 దంపతులచే 64 ముఖాల అభిషేకాన్ని నిర్వహించారు. వేడుకకు టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోకన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీశివక్షేత్రం తల్లయపాలెం విజయవాడ కార్యనిర్వహణ అధ్యక్షుడు ఎల్‌వీ.కుమార్, వాసవీ ఇంటర్నేషనల్ మహిళాపరివార్ అధ్యక్షురాలు హేమ, కార్యక్రమ సమన్వయకర్త వి.కోటేశ్వరరావు, సంగా జితేందర్, చింతల రజినీకాంత్ గుప్తా, బెల్లె రవికుమార్ పాల్గొన్నారు.



మన్సూరాబాద్ జడ్జెస్‌కాలనీలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, చిత్రంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, యువనాయకుడు రఘువీర్‌రెడ్డి తదితరులు

కాళభైరవుడికి నాగ సాధువు ప్రత్యేక పూజలు

అబ్దుల్లాపూర్‌మెట్: తట్టిఅన్నారంలోని శ్రీలలితా భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి, ఆదివారం మహాలక్ష్మి రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం చంద్రమౌళీశ్వర స్వామి ఆలయాన్ని నాగ సాధువు సందర్శించారు. ఈ సందర్భంగా కోట బాలకృష్ణ పంతులు ఆధ్వర్యంలో నాగసాధువు కాళభైరవుడికి అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూకుట్లపల్లి మహేందర్, సదానంద్, ప్రతీక్, భక్తులు పాల్గొన్నారు.



కొత్తపేట అష్టలక్ష్మి ఆలయంలో గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి గజవాహన సేవ, కనకాంబర పుష్పార్చన చేసి, సాయంత్రం పురవీధుల్లో ఆలయ నిర్వాహకులు ఊరేగించారు.

సరూర్‌నగర్‌లో...

ఎల్‌బీనగర్: సరూర్‌నగర్ హుడా కాలనీలోని పాతకోర్టు కాంప్లెక్స్ వద్ద సిద్ధార్థ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దసరా నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం అమ్మవారు అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్, బీజేపీ గీతా సెల్ రాష్ట్ర కోకన్వీనర్ రాగుల కిరణ్‌కుమార్‌గౌడ్, బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అరుట్ల సురేష్‌కుమార్ అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బీజేపీ సీనియర్‌నాయకుడు బీబీఆర్ వేణు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థయాత్ అసోసియేషన్ కమిటీ ప్రతినిధులు సుధీర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, నవీన్, భవాని పాల్గొన్నారు.



న్యూ మారుతీనగర్ దుర్గామాత మండపంలో అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేటలో...

కొత్తపేట: కొత్తపేటలోని వివిధకాలనీల్లో అమ్మవారికి ఆదివారం హోమాలు, విశేషపూజలను భక్తిశ్రద్ధలతో చేశారు. న్యూమారుతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఫణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో చండీహోమాన్ని నిర్వహించారు. నాయకులు నీరంకి రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. న్యూనాగోల్ కమ్యూనిటీహాల్‌లో రమేష్‌పంతులు ఆధ్వర్యంలో చండీహోమాన్ని నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పోచంపల్లి రాజేందర్‌రెడ్డి (పీఎంఆర్ రాజు), ప్రతినిధులు కృష్ణవేణి, సుమతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆర్టీసీకాలనీ, గంగకాలనీ, న్యూమారుతీనగర్ కాలనీల్లో దుర్గామాత పూజల్లో కార్పొరేటర్ పవన్‌కుమార్, బేర బాలకిషన్, శ్రీశైలం, ఐలయ్య, నాయకులు తీగుల్ల యాదగిరి, రవి, మల్లేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజ్‌కుమార్ కిషన్‌గౌడ్ వీరాస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుఖఃసంతోషాలతో జీవించాలి

వనస్థలిపురం: దుర్గామాత అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖఃసంతోషాలతో జీవించాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ రాజప్పనగర్‌లో ఏర్పాటు చేసిన దేవీనవరాత్రి ఉత్సవాలకు కార్పొరేటర్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాజప్పనగర్ కాలనీ అధ్యక్షులు దీపావళి శ్రవణ్‌కుమార్, రఘుబాబు, సాయినాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల హక్కుల సాధనకు కృషి చేయండి

వనస్థలిపురం, అక్టోబరు 6 (ఆంధ్ర జ్యోతి): విశ్వబ్రాహ్మణుల హక్కుల సాధనకు కృషి చేయాలని తెలంగాణ విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కోరారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా విశ్వబ్రాహ్మణ సమస్యలను పట్టించుకున్న నాథుడే లేడన్నారు. తక్షణమే విశ్వకర్మ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, యాభై ఏళ్లు నిండిన విశ్వకర్మలకు ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని, తెల్లరేషన్ కార్డు ఉన్నవారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలని, కట్టె కోత మిషన్‌లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, తదితర డిమాండ్‌ల వినతిపత్రాన్ని ఎమ్మెల్సీ మల్లన్నకు అందజేశారు. విశ్వకర్మల హక్కుల సాధనకు తన వంతు కృషిచేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారని జగన్నాథం తెలిపారు. విశ్వకర్మ సంఘం రాష్ట్ర నాయకులు సంకోజు లింగాచారి, అవంచి మురళీధర చారి, కాసోజు శ్రీనివాస చారి, వీరేష్ చారి పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతిపత్రం అందజేస్తున్న విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం, తదితరులు

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : జగదీష్‌యాదవ్

మన్సూరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సీఎం సహాయనిధి ఒక వరమని, అర్హులైన ప్రతి పేద కుటుంబమూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మన్సూరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు పోచబోయిన జగదీష్‌యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని కాస్మోపాలిటన్ కాలనీకి చెందిన సావిత్రమ్మకు ఇటీవల కాలు విరిగి ఆస్పత్రిలో చికిత్స పొందింది. ఆమె ఆర్థిక పరిస్థితి బాగులేకపోవడంతో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకుంది. ఈ మేరకు విడుదలైన రూ.34,500 చెక్కును ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం తన కార్యాలయంలో జగదీష్‌యాదవ్ సావిత్రమ్మకు అందజేశారు. కార్యక్రమంలో రామ్‌రెడ్డి, ధనమ్మ, సత్తమ్మ తదితరులు ఉన్నారు.



బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి దంపతులు, మహిళలు

ఘనంగా బతుకమ్మ వేడుకలు

వనస్థలిపురం, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ వేడుకలను భక్తిశ్రద్ధలతో మహిళలు ఉత్సాహంగా జరుపుకోవడం సంతోషకరమని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. తెలంగాణ రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీడీరెడ్డి గార్డెన్స్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దమైన బతుకమ్మ సంబురాలను కనులపండువగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మహిళా అసోసియేషన్ సభ్యులు గీతారెడ్డి, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తండ్రి మరణించిన సందర్భంగా ఆదివారం మంత్రి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శిస్తున్న వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు.
- వనస్థలిపురం, ఆంధ్రజ్యోతి

పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించాలి

చంపాపేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): పెరిగిన నిత్యావసరాల ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.చంద్రమోహన్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని నందనవనం శాఖ 9వ మహాసభలను ఆదివారం కుంటిగొర్ల రాములు అధ్యక్షతన నిర్వహించారు. సీపీఎం జెండాను ఆయన ఎగరవేశారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి అధిక ధరలపై సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కీసర నర్సిరెడ్డి, ఎల్‌బీనగర్ సర్కిల్‌కార్యదర్శి ఆలేటి ఏల్లయ్య, శాఖకార్యదర్శి యాదయ్య, సభ్యులు పాల్గొన్నారు.